సాక్షి నంద్యాల

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



వైభవంగా సీమోల్లంఘన

అశేష భక్తజనం మధ్య మంత్రాలయం పీఠాధిపతి సీమోల్లంఘన వైభవంగా జరిగింది. పీఠాధిపతి చాతుర్మాస దీక్ష బుధవారంతో ముగిసింది. 45 రోజుల పాటు దీక్ష బూనిన ఆయన ప్రత్యేక పూజలతో దీక్షను విరమించారు. ఆనవాయితీలో భాగంగా పీఠాధిపతి కొండాపూర్ ఆంజనేయ స్వామి సన్నిధానం నుంచి సీమోల్లంఘన కొనసాగింది. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య పూలమాల ధారణతో ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన ద్వారం నుంచి పీఆర్వో కార్యాలయం వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై పీఠాధిపతి నడయాడుతుండగా పూలవర్షం కురిసింది. కొండాపూర్ చేరుకుని వాయిదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరిగి ప్రత్యేక వాహనంలో పీఠాధిపతిని భక్త జన వాహిని మధ్య వైభవంగా ఊరేగించారు.

– మంత్రాలయం

- ఎన్నికల హామీలకు సీఎం చంద్రబాబు మంగళం
- సూపర్ సిక్స్ హామీలపై ఊసెత్తని వైనం
- బడ్జెట్ సమావేశాల్లో సంక్షేమ పథకాలకు నిధులు నిల్
- అమ్మఒడి ఇప్పట్లో లేదని మంత్రి ప్రకటన
- బాబును నమ్మి మోసపోయామంటున్న ప్రజలు
- గతంలో ఠంఛన్‌గా సంక్షేమ క్యాలెండర్ అమలు

ఎవరి పేరు చెబితే ప్రజలు మోసపోయామంటున్నారో తెలుసా? మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే ఎవరిలా ఉంటారో తెలుసా? వెన్నుపోటు పొడవడంలో నేర్పరి ఎవరో తెలుసా? ప్రజలను దగా చేసే ఘనకీర్తి ఎవరికి ఉందో తెలుసా?.. దగా.. మోసం.. వెన్నుపోటు.. ఈ మూడింటికి ప్రతి రూపమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఎన్నికల్లో సూపర్ సిక్స్‌ను ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బాబు వందరోజులకే చేతులెత్తేశారు. చాంతాడు మేనిఫెస్టోతో కూటమి నేతలు హడావుడి చేసి ఇప్పుడు మాట మార్చేస్తున్నారు. సీఎం, మంత్రుల ప్రకటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మోసకారి బాబును నమ్ముకుని సంక్షేమ పథకాలకు దూరమయ్యామని ఏకరువు పెడుతున్నారు.

– సాక్షి, నంద్యాల


మోసం 6.0






తల్లికి వందనం వచ్చే ఏడాది అమలు చేసే యోచన చేస్తాం.

– అసెంబ్లీలో మంత్రి లోకేశ్



సూపర్ సిక్స్ అంటే భయమేస్తోంది

– ఇక ఈ మాట అన్నది ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు



అంతన్నారు.. ఇంతన్నారు.. ఎన్నికల ముందు ప్రతి సభలో తమ్ముళ్లూ.. ఆడ బిడ్డలూ.. మీ భవిష్యత్‌కు నాది గ్యారంటీ అంటూ బీరాలు పలికారు. చివరకు అందరూ అనుమానించిందే నిజమైంది. సీఎం నారా చంద్రబాబు దగా కోరు తీరు చూస్తుంటే.. 'ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.. దాటాక బోడి మల్లన్న' అన్న సామెత గుర్తుకువస్తోంది. ఎన్నికల్లో గెలిచేందుకు నోటికి వచ్చిన అబద్ధాలను అలవోకగా వల్లెవేశారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని ఊరూరా ప్రచారం చేశారు. చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఆయనకు అధికారాన్ని అప్పగించారు. సీఎంగా ప్రమాణం స్వీకారం చేసి వంద రోజులైనా ఇచ్చిన హామీలపై నోరు మెదపడం లేదు. అంతేకాదు వాటిని చూస్తుంటే భయమేస్తుందని తప్పించుకునే ప్రయత్నం మొదలు పెట్టారు. ఆ క్రమంలోనే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. ఆరు పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజలు రూ.4,600.28 కోట్లు మేర నష్టపోనున్నారు. నాడు హామీల వరాలు కురిపించి.. నేడు వాటి ఊసెత్తక పోవడంతో చంద్రబాబు నైజం మరోసారి బయటపడింది. 2014లో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీని పూర్తిగా మరిచిపోయారు. ఇక ఇస్తామన్న నిరుద్యోగ భృతిని చివరి ఆరు నెలలు మాత్రమే అతి కొద్ది మందికి మాత్రమే ఇచ్చారు. మహిళలందరికీ స్మార్ట్‌ఫోన్లు ఇస్తామని చెప్పిన టీడీపీ నాయకులు ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. చివరికి మేనిఫెస్టోనూ టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన చరిత్ర చంద్రబాబుకే దక్కింది. అదే పంథాలో 2024లో వ్యవహరిస్తున్నారు. సూపర్ సిక్స్ అంటూ రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతను లక్ష్యంగా హామీల వరాలు కురిపించి ఇప్పుడు కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ సన్నాయి నొక్కులు నొక్కడం ప్రారంభించారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చినప్పటికీ ఆర్థిక పరిస్థితిని చూస్తే భయమేస్తోందని... ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాలని అసెంబ్లీ వేదికగా హామీలకు ఎలా మంగళం పాడనున్నారో విస్పష్టంగా చెప్పడం గమనార్హం.

ఆడబిడ్డ నిధి... ఏదీ..

ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి ఇంట్లో 18 ఏళ్ల నిండిన మహిళలు ఎంత మంది ఉంటే అందరికీ నెలకు రూ.1500 ఇస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. జిల్లా ఎన్నికల ప్రచారంలో ఇప్పటి అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ హామీని అటకెక్కించారు. జిల్లాలో 18ఏళ్లు నిండిన మహిళలు 6,98,404 మంది ఉన్నారు. వీరికి రూ.1257.12 కోట్లు ఇవ్వాల్సి ఉంది.

యువ నేస్తం.. మంగళం

2014లో అధికారంలోకి వచ్చిన బాబు నిరుద్యోగ భృతి ఏదో ఏడాది చివరి మొదటి నాలుగు నెలలు రూ.1000 చొప్పున ఇచ్చి చివరి రెండు నెలలు రూ.2వేల చొప్పున అతి కొద్ది మందికి మాత్రమే ఇచ్చేసి మమ అనిపించారు. మళ్లీ 2024లోనూ అదే హామీని సూపర్ సిక్స్‌లో పొందు పరిచారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చే వరకు యువ నేస్తం పేరుతో నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. జిల్లాలో 5,95,045 మంది ఉన్నట్లు అంచనా. వీరికి రూ.3 వేలు చొప్పున ఏడాదికి రూ.2142.62 కోట్లు అందజేయాల్సి ఉంది.



రూ. 45 వేలు రావాలి



నేను, నా భర్త పేరు నాగేష్ వ్యవసాయ కూలీపనులతో జీవనం సాగిస్తున్నాం. మాకు కిరణ్ (7వ తరగతి), హేమంత్ (5వ తరగతి), అఖిల (4వ తరగతి) ము గ్గురు సంతానం. ముగ్గురిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నాం. కూలీ పనులు చేసుకునే తమకు ముగ్గురు పిల్లలను చదివించడం భారంగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఇస్తామని చెప్పారు. ఇప్పుడు మాకు రూ.45 వేలు రావాలి. అధికారంలోకి రాగానే మాట మార్చితే నిలదీస్తాం.

– వసంత, శ్రీరంగాపురం, రుద్రవరం మండలం

మోసం చేస్తే చంద్రబాబుకు పుట్ట గతులు ఉండవ్



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద పిల్లవాడు రెహాన్ (6వ తరగతి), కుమార్తె ముత్కాన్ (4వ తరగతి) ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు.. నా భర్త లారీ డ్రైవర్. నేను, నా భర్త ఇద్దరం రోజూ పనిచేస్తే తప్పా కుటుంబం గడవని పరిస్థితి లేదు. ఇద్దరు పిల్లలు బడికి వెళ్తే రూ.30 వేలు ఇస్తానని చంద్రబాబు ఎన్నికల్లో చెప్పాడు. కానీ తల్లికి వందనం పథకాన్ని సీఎం మరిచాడేమో. పాఠశాలలు తెరిచి మూడు నెలలైనా ఇంతవరకు డబ్బులు జమ చేయలేదు. మా పిల్లలకు ఫీజు ఎలా చెల్లించాలో తెలియడం లేదు.

– షేక్ జరీనా, ఆత్మకూరు

మూడు పథకాలపై అప్పుడే యూటర్న్

చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించిన సూపర్ సిక్స్ హామీల్లో మూడు పథకాలపై 45 రోజుల్లోనే యూటర్న్ తీసుకున్నారు. బడికి పంపే ప్రతీ విద్యార్థికి రూ.30 వేలు ఇస్తామని ప్రచారం చేశారు. తాజాగా ముగిసిన బడ్జెట్ సమావేశాల్లో దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఈ ఏడాది తల్లికి వందనం ఇవ్వలేమంటూ చావు కబురు చల్లగా చెప్పారు. డేటా తీసుకుంటున్నామని డేటా అందాక పథకం అమలుపై నిర్ణయం ప్రకటిస్తామని సాకులు చెప్పారు.

- ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం ప్రస్తుతం అమలులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అసెంబ్లీ వేదికగా చెప్పారు.
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన కరువైంది. ఈ పథకం ఎలా అమలు చేయాలి అన్న దానిపై కసరత్తు జరుగుతోందని, విధివిధానాలను ఖరారు చేయలేదని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.
- కీలకమైన మూడు హామీలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన రైతులకు ఇస్తామని చెప్పిన రూ.20 వేల పెట్టుబడి సాయంపై కూడా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

రైతుకు వెన్నుపోటు..



2014లో తరహాలోనే రైతులను దగా చేస్తున్నారు. నాడు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, కోటయ్య కమిటీ అంటూ వ్యవసాయ రుణాల్లో మూడవ వంతు కోసేశారు. ఐదు విడతల్లో రుణాలు మాఫీ చేస్తానని చెప్పి అధికారంలో నుంచి దిగిపోయే నాటికి చివరి రెండు విడతలు ఇవ్వలేదు. మళ్లీ 2024లో అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఖరీఫ్ ఆరంభమైంది. జిల్లాలో 2,34,151 మంది రైతులు గతంలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా లబ్ధి పొందేవారు. వీరందరికీ ఈ ఏడాది రూ.20 వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు రూ.468.30 కోట్లు రైతన్నలకు లబ్ధి చేకూరాల్సి ఉంది.

బిడ్డకు మోసం.. తల్లికి భారం



గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారు. 1 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15వేల చొప్పున జమ చేసేవారు. ఇదే పథకాన్ని తల్లికి వందనం పేరుతో కూటమి సూపర్స్ సిక్స్‌లో చేర్చింది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. జిల్లాలో 2,84,555 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేయాల్సి ఉంది. ఇందు కోసం రూ. 427 కోట్లు నిధులు కేటాయించాల్సి ఉంది. బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత కూడా ఈ పథకానికి నిధులను విడుదల చేయలేదు. దీంతో ఈ సంవత్సరం పథకానికి మంగళం పాడినట్లేనని విమర్శలు వినిపిస్తున్నాయి.

మా ఇంటికి రూ. 4,500 ఇవ్వాల్సిందే



సాధారణ ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు 18 సంవత్సరాలు నిండిన మహిళలకు అందరికీ నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. ఈ లెక్కన మా ఇంట్లో ముగ్గురం లబ్ధిదారులం ఉన్నాం. మా ఇంటికి నెలకు రూ.4,500 ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ప్రతి రోజు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా కుర్చీలో కూర్చున్నాక ఆ ఊసే లేదు. మా కుటుంబంతో పాటు మహిళలు అందరూ ఎప్పుడెప్పుడు నెలకు రూ. 1,500 ఇస్తారా అని ఎదురు చూస్తున్నాం. ఈ దఫా మాట తప్పితే మేమేంటో.. మా శక్తి ఏంటో చూపిస్తాం.

– గద్ద శివమ్మ, చాగలమర్రి

జూన్ నుంచే నిరుద్యోగ భృతి చెల్లించాలి



నేను డీపీఈడీ పూర్తి చేసి రెండు సార్లు డీఎస్సీ రాశాను. ఉద్యోగం రాకపోవడంతో నిరుద్యోగిగా ఉన్నాను. చంద్రబాబు నాయుడు చెప్పిన నిరుద్యోగ భృతి మాకు ఆశ కలిగించింది. నాతో పాటు మా కుటుంబంలో ముగ్గురు నిరుద్యోగులు ఉన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తే నెలకు మాకు రూ. 9 వేలు వస్తాయి. కానీ ఇంత వరకు విధి విధానాలు అమలు చేయకపోవడం నిరాశ కలిగించింది. ఇప్పటికైనా మంత్రులు, అధికారులు ఓ నిర్ణయానికి కట్టుబడి నిరుద్యోగ భృతి జూన్ నుంచే చెల్లించాలి.

– పత్తేకాళ్ల ఇలియాస్, నిరుద్యోగి, బండిఆత్మకూరు


సాయం కోసం ఎదురు చూస్తునా



నేను గత కొన్నేళ్లుగా 15 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేస్తున్నాను. ప్రస్తుతం సీజన్ కావడంతో పొలాలను చదును కోసం, నారు కొనుగోలు, కూలీల ఖర్చులతో పొలం సాగుకు సిద్ధం చేసుకున్నాను. గత ప్రభుత్వంలో మే, లేదా జూన్ నెలలో మొదటి విడతలో రైతు భరోసా సొమ్ము మా ఖాతాల్లో జమ అయ్యేది. కానీ చంద్రబాబు ఎన్నికలకు ముందు చెప్పిన పెట్టుబడి సాయం ఇప్పటికి జమ కాలేదు.

– కుమ్మరి శివయ్య, రైతు, తమ్మడపల్లె

సంక్షేమ పాలన అంటే ఇదీ..



నేను విన్నాను.. నేను ఉన్నానంటూ 2019 ఎన్నికల్లో ప్రజలకు భరోసానిచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ రాజ్యాన్ని స్థాపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం ఠంఛన్‌గా అమలు చేశారు. అధికారంలోకి వచ్చేనాటికి ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉన్నప్పటికీ మేనిఫెస్టోలో ప్రకటించిన వాగ్దానాలన్నింటిని చిత్తశుద్ధితో అమలు చేశారు. ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేస్తూ ప్రకటించిన తేదీల్లోనే నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. కరోనా విపత్తులోనూ ఆర్థిక పరిస్థితి కుదేలైనా ఏ ఒక్క పథకాన్ని ఆపలేదు. నవరత్నాలను అర్హులైన ప్రతి ఇంటికి చేర్చారు. విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తూ పేదలకు మెరుగైన సేవలను అందించారు. నంద్యాల జిల్లాను ఏర్పాటు చేసిన ప్రజల కలను నెరవేర్చారు. ఊరూరా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ప్రభుత్వ సేవలను పేదల దరికి చేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన రంజక పాలన అందించారు.

సంక్షేమ పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	కేటాయించిన మొత్తం (రూ.కోట్లలో)
జగనన్న చేదోడు	52,282	52.28
వైఎస్ఆర్ కాపు నేస్తం	20,812	31.20
వైఎస్ఆర్ రైతు భరోసా	10,96,784	1475.83
వాహన మిత్ర	37,646	37.64
నేతన్న నేస్తం	2,800	67.20
చేయూత	97,254	698.92
వైఎస్ఆర్ పెన్షన్	2,22,938	3,143.96
ఆరోగ్యశ్రీ	1,82,117	410.97
జగనన్న అమ్మ ఒడి	4,87,707	634.01
ఈబీసీ నేస్తం	44,494	231.59
ఇన్‌పుట్ సబ్సిడీ	1,40,268	115.15
సున్నా వడ్డీ రుణాలు	1,81,484	87.09
వైఎస్ఆర్ యంత్రసేవ	2,395	16.45
ఉచిత పంటల బీమా	1,38,839	170.23

రైతు సంక్షేమానికి జగన్ కృషి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రైతు భరోసా అందింది. ఏటా రూ.13,500 చొప్పున రూ.54 వేలు నాబ్యాంక్ అకౌంట్‌లో జమ అయింది. 4.18 ఎకరాల్లో పంటలు సాగు చేస్తూ ఉంటాను. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా వల్ల పెట్టుబడులకు రావడంతో చాలా ఊరట లభించింది. సీజన్ ప్రారంభంలోనే రైతులకు వేయడం వల్ల రైతులకు మేలు జరిగింది. రైతు సంక్షేమానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు.

– కుమారస్వామిరెడ్డి, కమ్మవారిపల్లె, కొలిమిగుండ్ల మండలం

పేదలను ఆదుకున్నారు



పిల్లల చదువులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అమ్మ ఒడి పథకం చాలా మంచిది. మా ఇద్దరు పిల్లలు ఊర్లోనే ప్రభుత్వ పాఠశాలకు వెళుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.13వేలు చొప్పున అకౌంట్‌లో పడ్డాయి. ఎవరి ప్రమేయం లేకుండా నాలుగు విడతల్లో రూ.52 వేలు అందాయి. మాలాంటి ఎంతో మంది పేదలను జగన్ ఆదుకున్నారు.

– బీబీ, అబ్దుల్లాపురం, కొలిమిగుండ్ల మండలం

ప్రైవేట్ పరం చేస్తే చదువుకొనడం కష్టం



పదవ తరగతిలో 447/500(సీబీఎస్ఈ) మార్కులు తెచ్చుకున్నాను. ఇంటర్ మొదటి సంవత్సరంలో 432 మార్కులు వచ్చాయి. ఇలాగే ఇంకా బాగా చదివి నీట్ యూజీలో మంచి మార్కులతో మెరుగైన ర్యాంకు సాధించి మెడికల్ సీటు సాధించాలనేది నా కోరిక. కానీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తే నాలాంటి పేద, మధ్యతరగతి మెరిట్ విద్యార్థులకు విద్యను కొనడం కష్టమవుతుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉన్నట్లు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వైద్యులు, సిబ్బంది ఉండరు. రోగులు సైతం బయట నుంచి అద్దెకు తెచ్చి కూర్చోబెడతారని చాలా సార్లు మీడియాలో ప్రసారం అయ్యింది కూడా. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ చదువుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. పైగా ఫీజు ఎక్కువ.

– ఎల్. తర్షిత్, కర్నూలు



పేదలకు ప్రైవేట్‌లో వైద్యమందదు



మా నాన్న గోల్డ్‌స్మిత్. నేను టెన్త్‌లో 563 మార్కులు సాధించాను. ఇంటర్ మొదటి సంవత్సరంలో 422 మార్కులు తెచ్చుకున్నాను. ఇలాగే రెండవ సంవత్సరం, నీట్ యూజీలో కూడా మంచి మార్కులు సాధిస్తాను. మంచి ర్యాంకుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలోనే మెడికల్ సీటు సాధించాలన్నది నా కల. ప్రభుత్వ మెడికల్ కాలేజీ అయితే అక్కడ రోగులు ఎక్కువ మంది ఉంటారు. ప్రొఫెసర్లు కూడా ఎక్కువ మంది ఉండటం వల్ల నేర్చుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. రోగులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రాక్టికల్‌గా రకరకాల జబ్బుల గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వ కాలేజీలో సీటు వస్తే ఫీజు కూడా నామమాత్రంగా ఉంటుంది. ప్రభుత్వ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగిస్తే అది పూర్తిగా వాణిజ్యపరంగా మారుతుంది. వారు సీట్లను వ్యాపారం చేసి అమ్ముకుంటారు. వాటిని కొనే స్తోమత పేద, మధ్యతరగతి మెరిట్ విద్యార్థులకు ఉండదు. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలి.

– ఎస్.అఫ్షాతైసిన్, కర్నూలు

క్లుప్తంగా

కాల్వలో పడి విద్యార్థిని మృతి



అలమూరులో మృతి చెందిన విద్యార్థిని

రుద్రవరం: మండల పరిధిలోని అలమూరుకు చెందిన బాలిక ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాల్వలో పడి మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అలమూరు తిప్పమీద నివాసముంటున్న రఫీ, కమాల్‌బీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమార్తె రజియా (8) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. తిప్ప మీద నుంచి ప్రతి రోజు అలమూరు గ్రామంలోకి బడికి వచ్చి వెళ్లేది. ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో తోటి విద్యార్థినులతో కలిసి గ్రామ సమీపంలోని తెలుగుగంగ 28వ బ్లాక్ కాల్వలో దిగారు. అందులోని నీటిలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మునిగింది. తోటి విద్యార్థినులు గమనించి కేకలు వేయగా రోడ్డుపై అటుగా వెళ్లేవారు వెంటనే దిగి ఆ విద్యార్థినిని బయటకు తీశారు. అయితే అప్పటికే విద్యార్థిని మృతి చెందింది. ఈ విషయాన్ని ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయగా వారు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. విద్యార్థిని మృతితో తిప్పమీద విషాదం అలుముకుంది.

ఎన్ఎంఎంఎస్‌కు 24 వరకు గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.brc.ap.gov.in లో అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌టెస్ట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష రుసుం రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల రూ.50 ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్‌లో గాని, డీఈఓ కార్యాలయంలో గాని చెల్లించాలన్నారు.

'మర్రి' ఇంత అహంకారమా!



ఎస్సీ కులానికి చెందిన యువకుడితో కాళ్లు నొక్కించుకుంటున్న మర్రి గోవిందురాజు

డోన్: అధికారంలో ఉన్నాం.. ఏం చేసినా చెల్లుతుంది అనే భావన టీడీపీ నాయకుల్లో పెరిగిపోయింది. ఇందుకు ఈ సంఘటనే ఉదాహరణ. డోన్‌కు చెందిన టీడీపీ నేత, మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ మర్రి గోవిందురాజులు ఇటీవల దళిత కులానికి చెందిన ఓ వ్యక్తితో కాళ్లు నొక్కించుకోవడమే కాక ఆ వీడియోను సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు. ఇది ప్రస్తుతం వైరల్ అవుతుంది. దళితులు అంటే అధికార పార్టీ నాయకుడికి అంత చులకననా అని ఆ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. గతంలో ఈయన ఒక గొప్ప ఫిలాసఫర్‌గా వాట్సాప్ స్టేటస్‌లలో ఫొటోలు పెట్టి ప్రచారం చేసుకోవడం ,వందమాగదులుతో తనను పొగుడుతూ పాటలు పాడించుకుని ఆ వీడియోలను పోస్టు చేసి నవ్వులపాలు కావడం పరిపాటిగా మారింది.

అదుపు తప్పి కారు బోల్తా

- 10 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన మోక్షిత్‌తో తల్లి మౌనిక



బోల్తా పడిన కారు

వెల్దుర్తి: మండల పరిధిలోని మదార్‌పురం మదర్సా ముందు హైవే 44పై బుధవారం ఇన్నోవా కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో 10 మంది గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా డోన్ మండల కేంద్రంలోని తారకరామ నగర్‌కు చెందిన మంగళి పరమేశ్, అతని కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణగిరి మండలం పుట్లూరు శ్రీమాతా మారెమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఇన్నోవా కారులో వెళ్లారు. అమ్మవారికి పూజలు చేసుకున్న అనంతరం వెల్దుర్తి మీదుగా హైవే పైనుంచి తిరుగు ప్రయాణమయ్యారు. అతివేగంతో ఘటనా స్థలంలో ఫ్లైఓవర్ దాటగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు టైరు పగిలిపోవడంతో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టుకుంటూ ఎడమ పక్కనున్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. అటుగా వెళ్తున్న వాహనదారులు, సమీప గ్రామస్తులు కారులో ఇరుక్కుపోయిన వారిని అతికష్టం మీద బయటకు తీశారు. హైవే పోలీసులు, సిబ్బంది, స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను కర్నూలు, వెల్దుర్తి ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కారు డ్రైవర్ మంగళి రాఘవేంద్ర, మంగళి పరమేశ్, అతని తండ్రి రామలింగం, తల్లి వెంకటేశ్వరమ్మ, భార్య పార్వతమ్మ, సోదరి మౌనిక, వారి పిల్లలు మోక్షిత్, జ్యోతితో పాటు బైక్‌పై ఉన్న ప్యాపిలి మండలం చిన్నపూజర్లకు చెందిన ప్రవీణ్, కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన తెలుగు శంకర్ ఉన్నారు. తలకు తీవ్రగాయాలైన 11 ఏళ్ల మోక్షిత్, వెంకటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



తీవ్రంగా గాయపడి వెంకటేశ్వరమ్మ ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

మిర్చి పంటను దున్నేశాడు!



రైతు ప్రతాప్



పంటను రోటావేటర్‌తో దున్నేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఎదురుపాడు గ్రామానికి చెందిన రైతు ప్రతాప్ తను సాగు చేసిన మిర్చి పంటను దున్నేశాడు. రైతు విత్తు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. నారు, సేద్యం, పిచికారీ, మందులు, ఎరువులు, కూలీల కోసం దాదాపు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఒక కాపు రావడంతో తెంచి విక్రయించగా రూ.10 వేలు వచ్చింది. అంతలోనే అధిక వర్షాలకు పంట దెబ్బ తింది. దీనికి తోడు ధర లేకపోవడంతో మిర్చి తెంచిన ఖర్చులు కూడా రావడంలేదని పంటను దున్నేసినట్లు రైతు వాపోయాడు. దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

వ్యవసాయ ఉత్పత్తులకు తగ్గిన ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిరాశజనకంగా ఉన్నాయి. ఉల్లి, వేరుశనగ, కొర్ర, సజ్జలు, కందుల ధరలు తగ్గుముఖం పట్టాయి. కర్నూలు మార్కెట్‌కు 143 మంది రైతులు 4,266 క్వింటాళ్ల ఉల్లి గడ్డలు తెచ్చారు. ఇటీవల ఉల్లి ధరలు రూ. 4,200 వరకు వెళ్లాయి. తాజాగా ఉల్లికి కనిష్టంగా 529, గరిష్టంగా రూ. 3,779 ధర లభించింది. సగటు ధర రూ.3,528 నమోదైంది. కందుల ధర రూ.8,096 లభించింది. వేరుశనగ మార్కెట్‌కు 1148 క్వింటాళ్లు వచ్చింది. కనిష్టంగా రూ.3,393, గరిష్టంగా రూ.7,540 ధర లభించింది. సజ్జ రైతులకు నిరాశనే మిగిలింది. మార్కెట్‌కు 29 మంది రైతులు 418 క్వింటాళ్లు తీసుకురాగా కనిష్ఠ ధర రూ.1,830, గరిష్ఠ ధర రూ.2,392 లభించగా..సగటు ధర రూ. 2,251 నమోదైంది. మినుములకు రూ.7,709 ధర లభించింది. ఆముదాలకు కనిష్టంగా రూ.5,513, గరిష్టంగా రూ.5,881 లభించింది.

బనగానపల్లెలో రెచ్చిపోయిన టీడీపీ మూకలు

బనగానపల్లె: టీడీపీ శ్రేణుల అరాచకాలు పెరిగిపోతున్నాయి. దాడులు, దౌర్జన్యాలకు దిగి గ్రామాల్లో భయాందోళన సృష్టిస్తున్నారు. తాజాగా బనగానపల్లె పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అనుచరులు హల్‌చల్ చేసి ముగ్గురిని గాయపరిచారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన రషీద్‌బాషా, అబ్బాస్ హుస్సేన్ అన్నదమ్ముళ్లు. వీరి కుటుంబానికి సంబంధించిన పంచాయితీ విషయంలో మంత్రి బీసీ అనుచరులు మంగళవారం రాత్రి ఫోన్ చేసి పిలిచారు. ఇందుకు అబ్బాస్ హుస్సేన్ మీరే మా కాలనీ సమీపంలో ఉన్న చర్చి వద్దకు రావాలని చెప్పాడు. వెనువెంటనే వారు అక్కడికి చేరుకుని అబ్బాస్‌హుస్సేన్‌పై కర్రలు, రాడ్‌లతో దాడి చేశారు. గమనించిన అన్న రషీద్‌బాషా అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై కూడా దాడికి తెగబడ్డారు. గొడవ సమయంలో రషీద్ బాషా ఇంటి పక్కనే నివాసం ఉంటున్న శివనారాయణ తోపుడు బండిపై కొందరు పడడంతో తన బండి ఇరిగిపోతుందని దూరంగా వెళ్లి కొట్లాడుకోవాలని సూచించాడు. ఇందుకు ఆవేశంతో బీసీ అనుచరులు శివనారాయణ ఇంటిపై దాడి చేయడంతో పాటు ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారుడు గోపాలకృష్ణను గాయపరిచారు. వీరు ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. కాగా టీడీపీకి చెందిన గోవర్ధన్‌తో పాటు మరి కొందరు తనపై దాడికి పాల్పడిన్నట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన్నట్లు అబ్బాస్ హుస్సేన్ తెలిపారు.

ఇద్దరు యూట్యూబర్‌లపై కేసు నమోదు

ఆదోని అర్బన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోకి అనుమతి లేకుండా వచ్చి వీడియోలు తీయడంతోపాటు వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో ఇద్దరు యూట్యూబర్లు గౌస్, ఖాజాలపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ శ్రీరామ్ బుధవారం తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పశుకిసాన్ క్రెడిట్ ద్వారా రుణాలు



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసరావు

మహానంది: పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడి రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం కల్పిస్తున్నామని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. తమ్మడపల్లె, బొల్లవరం, బుక్కాపురం గ్రామాల్లో బుధవారం పశు వైద్యకేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. వీఎల్ఓ సులోచనతో కలిసి ఆయన మాట్లాడుతూ మినీ గోకులం ఏర్పాటు కోసం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నామన్నారు. బర్రెలకు రూ. 500తో ఎస్ఎస్ఎస్(సెమెన్) ఇంజక్షన్లు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

పీఆర్‌లో అడ్‌హాక్ పదోన్నతులు

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏఈఈలకు డీఈఈలుగా పోస్టింగ్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం జోన్–4 పరిధిలోని ఏఈఈలకు డీఈఈలుగా అడ్‌హాక్ పదోన్నతులు కల్పిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హత కలిగిన ఏడుగురు ఏఈఈలకు డీఈఈలుగా పదోన్నతి కల్పిస్తు పోస్టింగ్స్ ఇచ్చారు. అయితే సర్వీస్ కమిషన్ నుంచి ఎంపికైన వారికి మాత్రమే అడ్‌హాక్ పదోన్నతులు కల్పించడం భావ్యం కాదని, 1994లో వర్క్‌ఇన్‌స్పెక్టర్ నుంచి పదోన్నతి పొందిన ఏఈఈలతో పాటు సీఆర్‌పీ(సైక్లోన్ రీకన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్) ఏఈఈలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషియో ప్రకారం తమకు కూడా అడ్‌హాక్ పదోన్నతుల్లో న్యాయం చేయాలని కోరుతున్నారు.

పేరు	ప్రస్తుతం	పదోన్నతి పోస్టింగ్
మదన్‌మోహన్	డీపీఆర్‌ఈఓ, నంద్యాల పీఆర్ సర్కిల్	పీఐయూ, ఉరవకొండ, అనంతపురం జిల్లా
కె.మల్లికార్జున	డీపీఆర్‌ఈఓ, నంద్యాల పీఆర్ సర్కిల్	పీఆర్‌ఐ, మడకశిర, అనంతపురం జిల్లా
జి.ధనిబాబు	పీఐయూ, ఆత్మకూరు	పీఆర్‌ఐ, ఆత్మకూరు
రామ్మోహన్		పీఐయూ, ఆలూరు పీఆర్‌ఐ, నందికొట్కూరు
నాగశ్రీనివాసులు	ఎంఈఓ, బనగానపల్లె	పీఆర్‌ఐ, బనగానపల్లె
లక్ష్మినరసింహ	ఎంఈఓ, దొర్నిపాడు	పీఆర్‌ఐ, ఆళ్లగడ్డ
టి.సుధాకర్‌రెడ్డి	కర్నూలు క్వాలిటీ కంట్రోల్ విభాగం	డీఈఈ, నంద్యాల

బ్యాంకర్లు సహరించాలి

- జేసీ డాక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ యూనిట్ల ఏర్పాటుకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌పై పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారందరికీ నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద అన్నదాతలు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం యూనిట్ల ఏర్పాటు కోసం రుణాలను మంజూరు చేయాలన్నారు. కొన్ని బ్యాంకులు యూనిట్ల మంజూరుకు ముందుకు రావడం లేదని, బ్యాంకర్లను సమన్వయం చేయాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం రామచంద్రరావు, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, దళిత్ ఇండియాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కోఆర్డినేటర్ దిలీప్ పాల్గొన్నారు.

పోలీసును చూసి దొంగల పరార్



వస్తువులను పరిశీలిస్తున్న కానిస్టేబుల్

సి.బెళగల్: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన సొమ్ముతో వెళ్తూ పోలీసును చూసిన దొంగలు.. వాటిని అక్కడే వదిలి పరారైన ఘటన మండల పరిధిలోని తుంగభద్ర నదీతీరాన ఈర్లదిన్నె ఇసుక రీచ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. రీచ్ వద్ద వాహనాల తనిఖీ విధుల్లో కానిస్టేబుల్ శ్రీరాములు నిమగ్నమై ఉన్నాడు. ముగ్గురు యువకులు పల్సర్ బైక్‌పై వస్తూ కొంతదూరంలో అనుమానంగా నిలిచిపోవడంతో కానిస్టేబుల్ గమనించి ఎవరంటూ దగ్గరకు వెళ్తుండగా రెండు సంచులను అక్కడే వదిలి కొత్తకోట వైపు పరారయ్యారు. వెంటనే కానిస్టేబుల్ కొత్తకోట గ్రామస్తులను అప్రమత్తం చేశారు. కొత్తకోటలో కొంతమంది గుమిగూమి ఉండటం గమనించిన యువకులు కె.సింగవరం వైపు బైక్‌పై వేగంగా వెళ్లారు. ఈర్లదిన్నె గ్రామస్తులు కె.సింగవరం గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం దక్కలేదు. నిందితులు వదిలి వెళ్లిన సంచులను ఈర్లదిన్నె గ్రామస్తుల సమక్షంలో కానిస్టేబుల్ తనిఖీ చేయగా కంచు, రాగితో చేసిన పూజా సామగ్రి, గుడి గంటలు, దీపారాధన జ్యోతులు, హారతి పళ్లేలు, అభిషేకాలకు ఉపయోగించే ఇత్తడి బిందెలు ఉన్నట్లు గుర్తించారు.

'నవోదయ'లో ముగిసిన కళా ఉత్సవాలు



జానపద నృతం చేస్తున్న బాలికలు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవం బుధవారంతో ముగిసింది. రెండో రోజు బుధవారం 8 నవోదయ విద్యాలయాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మాట్లాడుతూ రెండు రోజులు పాటు నిర్వహించిన పోటీల్లో 24 విద్యాలయాల విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను చూపారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని కేరళలోని కోజికోడ్ నవోదయ విద్యాలయంలో జరిగే ప్రాంతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా నెల్లూరు జేఎస్‌వీ నుంచి జేమ్స్ (ఆర్ట్ టీచర్), కర్నూలు ప్రభుత్వ సంగీత శారద కళాశాల నుంచి శ్రీకిరణ్ (ఓకల్ విద్వాంసుడు), ఎమ్మిగనూరు నుంచి నాగరాజు (డ్యాన్స్ మాస్టర్)కొనసాగారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రన్ పాల్గొన్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు



క్యూకాంప్లెక్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్నఈఓ

శ్రీశైలంటెంపుల్: భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూకాంప్లెక్స్‌లో ఏర్పాట్లు చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్యూ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. భక్తుల రద్దీని బట్టి డి-బ్లాక్‌ను కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. క్యూకాంప్లెక్స్‌లో కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే క్యూకాంప్లెక్స్ ఎదురుగా భక్తుల ప్రవేశమార్గానికి ఎడమవైపు గదుల్లో సామాన్లు భద్రపర్చుకునేందుకు, పిల్లలకు పాలు పట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఈఈ వి.రామకృష్ణ, క్యూకాంప్లెక్స్ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎస్.వి.మోహన్, పర్యవేక్షకురాలు హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి నిలిచిన ఇసుక ఆఫ్‌లైన్ బుకింగ్

సి.బెళగల్: మండల కేంద్రంలో ఇసుక ఆఫ్‌లైన్ బుకింగ్ బుధవారం మరోసారి నిలిచిపోయింది. ప్రభుత్వ సెలవు దినాల్లో మాత్రమే బుకింగ్ ప్రక్రియకు సెలవు ఉంటుందని, మిగిలిన రోజుల్లో బుకింగ్ కొనసాగుతుందని ప్రకటించిన అధికారులు.. ఎప్పుడు పడితే అప్పుడు బుకింగ్‌ను నిలిపేస్తుండటంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం నుంచి ఇసుక బుకింగ్‌ను ఆన్‌లైన్‌లో చేపడుతున్న నేపథ్యంలో బుధవారం ఆఫ్‌లైన్ బుకింగ్‌ను జిల్లా మైనింగ్ అధికారులు నిలిపేసినట్లు మండల బుకింగ్ అధికారులు వెల్లడించారు. కాగా ముందస్తు సమాచారం లేకుండా బుకింగ్‌ను నిలిపేయడం పట్లు ఇసుక వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీగా జయలక్ష్మి

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీగా ఆర్.జయలక్ష్మిని నియమిస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం అనంతపురం మార్కెట్ కమిటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ ద్వారా లెటర్ తీసుకుని బదిలీ కోసం ప్రయత్నించి సఫలమయ్యారు. అనంతపురంలో ఉన్న జయలక్ష్మిని ఆన్‌డ్యూటీపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఏడాది పాటు పనిచేసే విధంగా ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కర్నూలులో పనిచేస్తున్న గోవిందును అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.